సాక్షి సూర్యాపేట

గురువారం : 27 : జూన్ : 2024



గంజాయి ముఠా అరెస్ట్
గంజాయి రవాణా చేస్తున్న ముఠా సభ్యులను పంతంగి టోల్‌ప్లాజా వద్ద పోలీసులు పట్టుకున్నారు. - 8లో



ఉత్పత్తులను ప్రోత్సహించాలి
చేనేత ఉత్పత్తులను ప్రోత్సహించాలని చేనేత, జౌళిశాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ఎం.వెంకటేశం అన్నారు. - 8లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం 32° / 26°
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రోడ్ల నిర్మాణానికి రూ.220 కోట్లు

- ఆర్‌అండ్‌బీ శాఖ చీఫ్ ఇంజనీర్ మోహన్‌నాయక్



అధికారులతో సమీక్షిస్తున్న సీఈ

హుజూర్‌నగర్: కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.220 కోట్లు మంజూరు చేసిందని ఆర్‌అండ్‌బీ శాఖ చీఫ్ ఇంజనీర్ జె.మోహన్‌నాయక్ తెలిపారు. రెండు నియోజక వర్గాల్లో చేపట్టిన రోడ్ల నిర్మాణం పనులను బుధవారం స్థానిక అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పర్యటించి పరిశీలించారు. అనంతరం హుజూర్ నగర్‌లోని ఆర్‌అంబీ బంగ్లాలో అధికారులు, కాంట్రాక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే రోడ్ల పనులకు టెండర్లు పిలిచినట్లు తెలిపారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశంతో మరో రూ.200 కోట్ల పనులను పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. రోడ్ల నిర్మాణ పనులను నాణ్యతాప్రమాణాలతో వేగంగా పూర్తిచేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. సమీక్షలో ఈఈ గుంటూరు భాస్కర్, డీఈలు రమేష్, పవన్ కుమార్, పద్మావతి, ఏఈఈలు శివకుమార్, సత్యనారాయణ, కాంట్రాక్టర్లు సంకినేని కృష్ణారావు, సంపత్, సత్యమయ్య, గుండా బ్రహ్మారెడ్డి, రంగారావు, వెంకటప్రసాద్, ఆంజనేయులు, కొండానాయక్, శ్రీనివాస్‌రెడ్డి, రమణయ్య పాల్గొన్నారు.

వ్యసనాలకు లోనుకావొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీవాణి

చివ్వెంల: యువత, విద్యార్థులు డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలు వంటి చెడు వ్యసనాలకు లోనుకావొద్దని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పి.శ్రీవాణి అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కోర్టు ప్రాంగణంలో మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా కోర్టు ప్రాంగణంలో పారా వలంటీర్లు, విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. వలంటీర్లంతా మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను గ్రామీణ ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకల సుదర్శన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి దపుకు మల్లయ్య, డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు వసంత సత్యనారాయణపిళ్లే యాదవ్, బొల్లెద్దు వెంకటరత్నం, భట్టిపల్లి ప్రవీణ్‌కుమార్ గౌడ్, పెండెం వాణి, న్యాయవాదులు పాల్గొన్నారు.

సూర్యాపేట బస్‌డిపోను సందర్శించిన ఆర్‌ఎం

భానుపురి (సూర్యాపేట): సూర్యాపేట బస్ డిపోను బుధవారం ఆర్టీసీ నల్లగొండ రీజియన్ మేనేజర్(ఆర్‌ఎం) రాజశేఖర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు డిపో మేనేజర్ డి.సురేందర్ స్వాగతం పలికారు. కొత్తబస్టాండ్‌తో పాటు హైటెక్ బస్టాండ్‌లో పలు స్టాండ్లను ఆర్‌ఎం పరిశీలించారు. సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హైటెక్ బస్టాండ్ ఆవరణలో మొక్కలు నాటారు. ఆయన వెంట అసిస్టెంట్ మేనేజర్ బి.సైదులు, అధికారులు కృష్ణయ్య, నాగమణి, కండక్టర్లు, డ్రైవర్లు ఉన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలి

మునగాల: తెలంగాణలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డీవైఎఫ్‌ఐ) రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ డిమాండ్ చేశారు. బుధవారం డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో మునగాల, నేలమర్రి గ్రామాల్లో యువజన సమస్యలపై సర్వే నిర్వహించి మాట్లాడారు. నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కాసాని కిశోర్, బోయిళ్ల నవీన్‌కుమార్, సభ్యులు గడ్డం వినోద్, సతీష్, సురేందర్ పాల్గొన్నారు.



సర్వే చేస్తున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

ఖాకీ వనంలో కలుపు మొక్కలు!



ఉమ్మడి జిల్లాలో పలువురు ఎస్‌ఐలపై ఆరోపణలు
- మహిళల పట్ల అనుచిత ప్రవర్తన
- సివిల్ వివాదాల్లో జోక్యం.. సెటిల్‌మెంట్లు
- అవినీతి, అక్రమ దందాలు
- పోలీస్‌శాఖకు మచ్చతెస్తున్న కొందరి తీరు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: 'నాతో మంచిగా ఉండూ.. నీ అవసరాలు తీరుస్తా...' అంటూ శాలిగౌరారం ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ అనుచితంగా ప్రవర్తించారని ఎస్పీ, డీజీపీలకు ఓ మహిళ ఫిర్యాదు చేయడం జిల్లాలో సంచలనంగా మారింది. కొందరు ఖాకీలు బాధితుల అవసరాలను ఆసరాగా చేసుకుని పోలీస్ స్టేషన్లలోనే పంచాయితీలు, సెటిల్‌మెంట్లు చేస్తూ దండుకుంటుండగా.. మరికొందరు సివిల్ వివాదాల్లో జోక్యం చేసుకొని అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారు. అదీ చాలదన్నట్లు ఇంకొందరు మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తూ పోలీసు శాఖకే మచ్చ తెస్తున్నారు. వివిధ సందర్భాల్లో ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు సస్పెండ్ చేయడం, ఎస్పీ కార్యాలయాలకు అటాచ్ చేయడం వంటి చర్యలు చేపడుతున్నా అలాంటి వారిలో మార్పు రావడం లేదు. పైగా రాజకీయ పలుకుబడితో కొద్దిరోజుల్లోనే తిరిగి పోస్టింగ్ పొందుతున్నారు.

అవసరాలను ఆసరాగా చేసుకొని..

బాధితుల అవసరాలే ఆసరాగా కొంతమంది ఎస్‌ఐలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. రాజకీయ నేతల అండదండలతో అవినీతి దందా కొనసాగిస్తున్నారు. ఏదైనా కేసు విషయంలో పోలీస్‌స్టేషన్‌కు వెళ్తే చాలు న్యాయఅన్యాయాలు పట్టించుకోకుండా, ముడుపులు ముట్టజెప్పిన వారికి వంతపాడుతూ బాధితులను వేధింపులకు గురి చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో నల్లగొండ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేసిన ఓ ఎస్‌ఐపైనా లైంగిక వేధింపుల ఆరోపణలు చేస్తూ డీఎస్పీకి ఓ వ్యక్తి ఫిర్యాదు చేశారు. అయితే ఆ తరువాత అతన్ని పోలీసు తరహాలో మేనేజ్ చేసి ఆ ఫిర్యాదును వెనక్కి తీసుకునేలా చేశారు.

ఎస్‌ఐ తీరుతో గుండెపోటు.. వ్యక్తి మృతి

చింతపల్లి మండలంలో గతంలో పనిచేసిన ఓ ఎస్‌ఐ భూవివాదంలో జోక్యం చేసుకున్నారు. ఆ కేసులో ఓ వృద్ధుడిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి కొట్టడం వల్లే అతను చనిపోయాడని ఆ వృద్ధుడి బంధువులు ఆందోళన వ్యక్తం చేశారు. అయితే పోలీసులు ప్రశ్నిస్తున్న సమయంలో వృద్ధుడికి గుండెపోటు వచ్చిందని, పోలీసులు కొట్టినందున ఆయన చనిపోలేదని, గుండెపోటు కారణంగానే అతను చనిపోయాడని తేల్చారు. కాగా, సదరు ఎస్‌ఐని పోలీస్ శాఖ సస్పెండ్ చేసింది. కొద్దినెలలకే రాజకీయ పలుకుబడితో ఆయన పోస్టింగ్ తెచ్చుకోగలిగారు.

ప్రతీ చిన్న పనికి ముడుపులే..

నల్లగొండ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో చాలా కాలంగా పని చేస్తున్న ఓ ఎస్‌ఐ సివిల్ కేసులో జోక్యం చేసుకొని ముడుపులు పుచ్చుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేకాదు మధ్యవర్తిగా వ్యవహరించిన వ్యక్తి దగ్గర నుంచి సదరు ఎస్‌ఐ మరో రూ.20 వేలు తీసుకున్నట్లు తెలిసింది. దీంతో మధ్యవర్తిగా వ్యవహరించిన వ్యక్తి తమకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో బాధితురాలు సీఐకి విషయాన్ని తెలియజేసింది. దీంతో సీఐ సదరు ఎస్‌ఐకి వార్నింగ్ ఇచ్చినట్లు చర్చ జరుగుతోంది. అంతేకాదు వృద్ధ దంపతులు తమ కుమారుడిని ఎర్రగడ్డ ఆసుపత్రికి పంపించేందుకు కేసు నమోదు చేయాలని సదరు ఎస్‌ఐని కోరగా వారి నుంచి కూడా ముడుపులు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇలా ఆ ఎస్‌ఐ ప్రతి చిన్నపనికి ముడుపులు పుచ్చుకుంటున్నట్లు తెలుస్తోంది.

వివాదం నుంచి బయట పడేందుకు రాజకీయ ఒత్తిళ్లు!

మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వివాదం నుంచి బయటపడేందుకు ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. అందులో భాగంగా స్థానిక నేతలు కొందరు బాధితురాలి కుటుంబంపై తీవ్ర ఒత్తిడిని తీసుకొస్తున్నట్లు సమాచారం. ఓ నాయకుడు మరో అడుగు ముందుకేసి నకిరేకల్‌లో నివాసం ఉంటున్న ఎస్‌ఐ ఇంటికి మిమ్ములను తీసుకుపోతానని, మీరు రాజీ పడాలని సూచించినట్లు తెలిసింది. మేము చెప్పినట్లు వింటే మీకు అన్ని విధాలుగా సహకారం ఉంటుందని, లేకపోతే సమస్యలను ఎదుర్కోవాల్సి ఉంటుందని కూడా ఆ నాయకుడు హెచ్చరించినట్లు సమాచారం. ఆ నేతలే పోలీస్‌స్టేషన్‌కు వచ్చే కేసుల్లో ఎస్‌ఐకి మధ్యవర్తులుగా వ్యవహరించి సెటిల్‌మెంట్లు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు బాధితురాలు ఓ రాజకీయ పార్టీకి చెందిన నాయకుడి సహకారంతో ఎస్పీకి ఫిర్యాదు చేయడాన్ని మరో రాజకీయ పార్టీ నేతలు జీర్ణించుకోలేక ఎస్‌ఐ తరఫున వకాల్తా పుచ్చుకున్నట్లు తెలిసింది. అందులో ఇద్దరు ముఖ్య నేతలు కూడా ఉన్నట్లు సమాచారం. దీంతో బాధిత కుటుంబం తమకు న్యాయం జరుగుతుందో లేదోనని ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ నేపథ్యంలో ఎస్పీ విచారణ అధికారిగా నియమించిన సదరు అధికారిపై తమకు నమ్మకం లేదని, ఆయనను మార్చాలని సదరు బాధితురాలు డీజీపీకి ఫిర్యాదు చేశారు.

- నల్లగొండ జిల్లా డిండి మండలంలో ఓ ఎస్‌ఐ ఎర్రగుంటపల్లిలో భూ వివాదంలో జోక్యం చేసుకొని ఒక వర్గానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని మరో వర్గం వారు డీఎస్పీకి ఫిర్యాదుచేశారు.
- గుండాల మండలంలో ఓ ఎస్‌ఐ ఇసుక దందాకు పూర్తిస్థాయిలో సహకరించారన్న ఆరోపణలు ఉన్నాయి.

ఎదురు తిరిగితే బెదిరింపులు, అక్రమ కేసులు

యాదాద్రి జిల్లా మోత్కూర్ మండలంలో పని చేసిన ఓ ఎస్‌ఐ భూవివాదాల్లో మితిమీరిన జోక్యం చేసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తనకు ఎదురుతిరిగిన వారిపై చేయి చేసుకోవడం, బెదిరింపులకు పాల్పడడం, అక్రమ కేసులను పెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. మండలంలోని ముసిపట్ల గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని పోలీస్‌స్టేషన్‌లో బంధించి చితకబాదినట్లు తెలిసింది. అంతే కాదు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వారిపైనా చేయి చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఎస్పీ కార్యాలయానికి అటాచ్

సూర్యాపేట జిల్లా నాగారం మండలంలో పనిచేసిన ఓ ఎస్‌ఐ గతంలో భూవివాదంలో జోక్యం చేసుకున్నారు. అందులో ఫిర్యాదుదారుడి వైపు కాకుండా ఎదుటి వ్యక్తికి అనుకూలంగా వ్యవహరించారు. ఎదుటి వ్యక్తికి 20 గుంటల భూమి ఇవ్వాలని చెప్పారు. ఆ మాట వినకపోవడంతో ఎస్‌ఐ విచక్షణ కోల్పోయి ఓర్సు అశోక్‌ను చితకబాదారు. దీనిపై వారు ఎస్పీ, మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐని ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేశారు.
- తిరుమలగిరి మండలంలోనూ గతంలో పనిచేసిన మరో ఎస్‌ఐ సివిల్ వివాదాల్లో జోక్యం చేసుకుంటున్నారని ఆరోపణలు రావడంతో ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేశారు.

నాణ్యమైన పెట్రోల్, డీజిల్ అందిస్తాం



జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రాతో కలిసి పెట్రోల్ బంకును ప్రారంభిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

- జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్యమిశ్రా
- ఇమాంపేట వద్ద జైళ్ల శాఖ పెట్రోల్ బంకు ప్రారంభం

సూర్యాపేట: వాహనదారులకు నాణ్యమైన పెట్రోల్, డీజిల్ అందిస్తామని జైళ్లశాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్య మిశ్రా అన్నారు. సూర్యాపేట మండలం ఇమాంపేట వద్ద జైలు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంకును బుధవారం జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జైళ్ల శాఖ ఆధ్వర్యంలో మొట్టమొదటి సారిగా ఉమ్మడి ఏపీ రాష్ట్రంలో కడప జిల్లాలో పెట్రోల్ బంకు ప్రారంభించామని, ఇప్పటి వరకు 30 పెట్రోల్ బంకులు ఏర్పాటు చేశామన్నారు. కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ కల్తీ లేని పెట్రోల్ అందించేందుకే ప్రభుత్వం జైళ్ల శాఖ ద్వారా బంకులు ఏర్పాటు చేస్తోందన్నారు. వాహనదారులకు మెరుగైన సేవలు అందించాలని చెప్పారు. జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ జైళ్ల శాఖ ద్వారా ఏర్పాటు చేస్తున్న పెట్రోల్ బంకులకు ప్రజలు సపోర్ట్ చేయాలన్నారు. ఈ బంకును ప్రజలు వినియోగించుకోవాలన్నారు. అనంతరం జైలు ఖైదీలు తయారు చేసిన వివిధ వస్తువులను సౌమ్య మిశ్రా, కలెక్టర్, ఎస్పీలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జైళ్ల శాఖ ఐజీ ఎస్.మురళి బాబు, అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, డీఎస్పీ రాములు, ఇంజన్ ఆయిల్ డివిజిల్ రిటైల్ సేల్స్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎస్.శ్రీకాంత్, జిల్లా సబ్ జైలు అధికారి ఆర్.శోభన్‌బాబు, సూర్యాపేట సబ్ జైల్ సూపరింటెండెంట్ బి.సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



పెట్రోల్ బంకు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సౌమ్య మిశ్రా

600 మంది ఎస్‌జీటీలకు పదోన్నతి!

- ఎస్‌ఏలుగా ప్రమోషన్ కోసం వెబ్ ఆప్షన్ ప్రక్రియ పూర్తి
- నేడు వెలువడనున్న ఉత్తర్వులు

సూర్యాపేట టౌన్: ఉపాధ్యాయుల బదిలీల్లో భాగంగా ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్(ఎస్‌ఏ)లుగా పదోన్నతి కల్పించే ప్రక్రియ ప్రారంభమైంది. మంగళ, బుధవారాల్లో ఎస్‌జీటీలు.. ఎస్‌ఏల ప్రమోషన్లకు సంబంధించి వెబ్ ఆప్షన్లు కూడా పెట్టుకున్నారు. బుధవారం సాయంత్రానికి ఎడిట్ ఆప్షన్ కూడా ముగిసింది. గురువారం ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతుల ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది. మొత్తంగా లోకల్ బాడీస్ విభాగంలో 600 మంది ఎస్‌జీటీలు స్కూల్ అసిస్టెంట్‌లుగా పదోన్నతి పొందనున్నారు.

ప్రమోషన్ వీరికే..

ఇందులో 300 మంది వరకు ఎస్‌జీటీలు, మరో 300 మంది అప్‌గ్రేడ్ అయిన ఎల్‌పీటీలకు ఎస్‌ఏ తెలుగు, ఎల్‌పీహెచ్‌కు ఎస్‌ఏ హిందీ, పీఈటీలకు ఎస్‌ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్‌గా పదోన్నతి లభించనుంది. వీరందరూ ప్రమోషన్ల ఉత్తర్వులు రాగానే వెంటనే ఆయా పాఠశాలల్లో చేరనున్నారు. ఇదిలా ఉంటే జీహెచ్‌ఎంలుగా 68 మందికి, స్కూల్ అసిస్టెంట్ల బదిలీలు 1,450 మంది కాగా, 16మంది ఎస్‌జీటీలు ప్రభుత్వ యాజమాన్య పరిధిలో పనిచేసే వారు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి వచ్చిన విషయం తెలిసిందే. పదోన్నతుల అనంతరం ఎస్‌జీటీల బదిలీల ప్రక్రియ కొనసాగనుంది. బదిలీల కోసం సుమారు 1,500 మంది వరకు ఉన్నారు. వీరందరినీ ఖాళీ పోస్టులు ఉన్న వివిధ పాఠశాలలకు బదిలీ చేయనున్నారు.

నిబంధనలు పాటించని ఆస్పత్రులను సీజ్ చేస్తాం

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ కోటాచలం
- సూర్యాపేటలో నాలుగు ప్రైవేట్ ఆస్పత్రుల సీజ్

సూర్యాపేట: అర్హత గల డాక్టర్లు లేకుండా, అగ్నిమాపక భద్రతా నిబంధనలు పాటించకుండా నిర్వహిస్తున్న ప్రైవేట్ ఆస్పత్రులను సీజ్ చేస్తామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కోటాచలం హెచ్చరించారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో బుధవారం ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న శ్రీ చెస్ట్, నక్షత్ర, శ్రీ సూర్య, సాయి కీర్తన ప్రైవేట్ ఆస్పత్రులను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా ఆస్పత్రుల్లో డాక్టర్లు లేరని, ప్రభుత్వ డాక్టర్లు కన్సల్టెంట్‌గా పనిచేస్తున్నారని, ప్రభుత్వ డాక్టర్ల పేరు మీద నమోదైన ఆస్పత్రుల రిజిస్ట్రేషన్ రద్దు చేస్తామని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి ముందస్తు నోటీసు ఇవ్వకుండానే సీజ్ చేస్తామన్నారు. రెండు రోజుల్లో జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రుల వారు అగ్నిమాపక భద్రతా, బయో మెడికల్, పొల్యూషన్ కంట్రోల్ సర్టిఫికెట్లు సమర్పించాలన్నారు. స్పందించకుంటే చట్టపరంగా చర్యలు ఉంటాయన్నారు.



సూర్యాపేటలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ కోటాచలం

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



సూర్యాపేటలో మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎస్పీ


- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట టౌన్: మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండేలా అనుబంధ శాఖల అధికారులు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాలు అక్రమ రవాణా, వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా మహిళా, శిశు సంక్షేమ, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద నుంచి సద్దల చెరువు మినీ ట్యాంక్ బ్యాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కలెక్టర్.. జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్‌తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పోలీస్, ఎక్సైజ్, యాంటీ నార్కోటిక్స్ బ్యూరోతో పాటు ఇతర శాఖల ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులు, యువతకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా డ్రగ్స్ ప్రోగ్రాం మిషన్ పరివర్తన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగేశ్వరావు, డీఎస్పీ రవి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ కోటాచలం, జిల్లా సంక్షేమ అధికారి జ్యోతి పద్మ, డీఐఈఓ కృష్ణయ్య, కళాశాలల ప్రిన్సిపాళ్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గోదాము నుంచి గుట్కాల తరలింపు!

సూర్యాపేట టౌన్: జిల్లా కేంద్రంలో గుట్కా దందా జోరుగా సాగుతోంది. దీనిపై బుధవారం 'సాక్షి'లో 'గుట్టుగా గుట్కా దందా' శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైంది. ఈ కథనంతో అప్రమత్తమైన సదరు వ్యాపారి వెంటనే వ్యవసాయ మార్కెట్‌లో ఉన్న తన గోదాం నుంచి రహస్య ప్రాంతాలకు గుట్కా ప్యాకెట్లను తరలించినట్టు సమాచారం. పోలీసులకు చిక్కకుండా తన మనుషులతో వివిధ ప్రాంతాలకు స్కూటీలు, ఆటోల ద్వారా గుట్కాల బ్యాగులను తరలించినట్టు తెలుస్తోంది. హోల్‌సేల్ వ్యాపారులను సైతం అలర్ట్ చేసినట్టు సమాచారం. ఇంత జరుగుతున్నా పోలీసులు పట్టించుకోట్లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మున్సిపాలిటీలను సుందరంగా తీర్చిదిద్దాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

భానుపురి (సూర్యాపేట): జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. బుధవారం సూర్యాపేట కలెక్టరేట్‌లో మున్సిపల్ కమిషనర్లు, ఇంజనీర్లతో మున్సిపాలిటీల్లో అమలవుతున్న కార్యక్రమలు, చేపట్టిన పనులు, అమృత్, ఎస్‌బీఎం, 15వ ఫైనాన్స్, పట్టణ ప్రగతి నిధుల పనులపై అదనపు కలెక్టర్ సీహెచ్.ప్రియాంకతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు పడుతున్నందున అన్ని మున్సిపాలిటీల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాలన్నారు. తాగునీరు, స్ట్రీట్ లైటింగ్ ఏర్పాటు చేయాలని, ఇంటిపన్ను, నీటిపన్నుల వేగం పెంచాలని సూచించారు. మున్సిపాలిటీల్లో విలీనమైన గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. నర్సరీల నిర్వహణపై దృష్టిపెట్టి మొక్కలను అందుబాటులో ఉంచాలని, పార్కుల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు శ్రీనివాస్, రమాదేవి, శ్రీనివాస్, అశోక్‌రెడ్డి, బుచ్చిబాబు, ఇంజనీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ద్విభాష పుస్తకం.. సులువైన పాఠం

- తెలుగు, ఆంగ్ల భాషల్లో ప్రభుత్వ పాఠ్యపుస్తకాల ముద్రణ
- మూడేళ్ల నుంచి విద్యార్థులకు సరఫరా
- పుస్తకాల బరువు తగ్గించేందుకు రెండు పార్ట్‌లుగా విభజన
- చిన్నారులు, ఉపాధ్యాయులకు ప్రయోజనకరంగా పుస్తకాలు



ఇంగ్లిష్, తెలుగులో ముద్రించిన టెన్త్ సైన్స్ బుక్

విద్యార్థుల సంఖ్య	పంపిణీ చేసిన పార్ట్–1 పుస్తకాల సంఖ్య
80,748	3,66,830
అందించిన నోట్‌బుక్స్ 2,96,954	

హుజూర్‌నగర్: మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలలు కూడా సరికొత్త హంగులతో రూపుదిద్దుకుంటున్నాయి. ప్రభుత్వ విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడాలనే ఉద్దేశంతో పాఠశాలల్లో మూడేళ్ల క్రితం ఒకటి నుంచి ఎనిమిదవ తరగతి వరకు ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టింది. ఏటా ఒక్కోతరగతి పెంచుకుంటూ వస్తోంది. ప్రస్తుత సంవత్సరం నుంచి పూర్తిగా పదో తరగతి వరకు ఆంగ్ల మాధ్యమం బోధించనున్నారు. ఇందులో భాగంగా మొదట ఒకటి నుంచి 8వ తరగతి వరకు ప్రతి పుస్తకంలో అంటే భాషేతర పుస్తకాలైన గణితం, సామాన్య, భౌతికశాస్త్రం, జీవశాస్త్రం, సాంఘిక శాస్త్రం పుస్తకాల్లో అన్ని పాఠ్యాంశాలను ఒక పేజీలో తెలుగులో దాని పక్క పేజీలో ఇదే పాఠ్యాంశానికి సంబంధించిన అంశాలను ఆంగ్ల భాషలో ముద్రించారు. ఆ తర్వాత తొమ్మిదో తరగతి, తాజాగా ఈ ఏడాది నుంచి పదో తరగతి పుస్తకాల్లో ప్రతి పాఠాన్ని రెండు భాషల్లో ముద్రించారు. దీంతో ప్రాథమిక స్థాయి నుంచి పదో తరగతి వరకు అన్ని పాఠ్య పుస్తకాల్లో రెండు మాధ్యమాల్లోనూ సులభంగా చదువుకునే అవకాశం ఏర్పడింది. ద్విభాషలో రూపొందిన పాఠ్యపుస్తకాల్లో ఒక ఆంగ్లం పదానికి అర్థం తెలియకున్నా పక్క పేజీలోని తెలుగులో చూసుకునేందుకు ఇటు విద్యార్థులకు, అటు ఉపాధ్యాయులకూ ప్రయోజకరంగా మారింది.

మోత బరువు తగ్గించేందుకు..

ప్రతి పుస్తకాన్ని ఆంగ్లం, తెలుగులో ముద్రిస్తే పుస్తకం పేజీల సంఖ్య రెట్టింపై విద్యార్థులకు మోత బరువు పెరగకుండా ఉండేందుకు రెండు విభాగాలుగా విభజించారు. వాటిలో పాఠాలను తొలుత సగ భాగం పార్ట్–1గా, మిగతా సగ భాగం పార్ట్–2గా విభజించారు. ఉపాధ్యాయులు పాఠశాల ప్రారంభంలో మొదటి భాగంలోని పాఠ్యాంశాలను, తర్వాత రెండో భాగం పాఠ్యాంశాలను బోధిస్తారు.

3.66లక్షల పాఠ్య పుస్తకాలు పంపిణీ

జిల్లాలో 690 ప్రాథమిక పాఠశాలల్లో 33,200 మంది విద్యార్థులు ఉన్నారు. అలాగే 78 ప్రాథమికోన్నత పాఠశాలల్లో 13,012 మంది, 183 ఉన్నత పాఠశాలల్లో 24,330 మంది, 9 మోడల్‌స్కూళ్లలో 6,500 మంది, 18 కేజీబీవీల్లో 3,706 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి ఇప్పటికే జిల్లాకు పార్ట్–1 పాఠ్య పుస్తకాలు అందజేశారు.

పాఠాలు సులువుగా అర్థమవుతున్నాయి



విద్యాశాఖ పరంగా ద్విభాషలో ముద్రించిన పాఠ్యపుస్తకాల విద్యార్థులకు ఎంతో ప్రయోజకరంగా ఉంటున్నాయి. పుస్తకాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠాలను సులువుగా అర్థం చేసుకుంటున్నారు. ద్విభాష పుస్తకాలు వల్లే ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు వచ్చాయి.
– మాతంగి ప్రభాకర్‌రావు, పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు, హుజూర్‌నగర్

క్లుప్తంగా

మిర్యాలగూడ వాసికి జాతీయస్థాయి అవార్డు



అవార్డు అందుకుంటున్న నాగబ్రహ్మాచారి

మిర్యాలగూడ టౌన్: గత 20 ఏళ్లుగా ఎలక్ట్రికల్ రంగంలో అనేక సేవలు అందించిన నార బత్తుల వెంకట నాగబ్రహ్మాచారిని బహుజన సాహిత్య అకాడమీ సంస్థ, నేషనల్ కమ్యూనిటీ ఆఫ్ ఇండియా వారు గుర్తించి సేవారత్న నేషనల్ అవార్డు–2024కు ఎంపిక చేశారు. మంగళవారం రాత్రి హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లిలో గల సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎం గౌతమ్, రాష్ట్ర కమిటీ సభ్యుడు డాక్టర్ శ్రీనివాస్‌గౌడ్ చేతులమీదుగా ఈ అవార్డును వెంకట నాగబ్రహ్మాచారి అందుకున్నారు.

సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలి



ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న పీవైఎల్ నాయకులు

భానుపురి (సూర్యాపేట): నీట్ పరీక్ష ప్రశ్నాపత్రం లీకేజీపై సుప్రీం కోర్టు జడ్జితో విచారణ జరిపించాలని పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు ఇందూరు సాగర్ అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో పీడీఎస్‌యూ–పీవైఎల్ ఆధ్వర్యంలో నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ ప్రధాని రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఇందూరు సాగర్ మాట్లాడుతూ.. నీట్ పరీక్ష ప్రశ్నాపత్రం లీకేజీపై ప్రధాని స్పందించకపోవడం దారుణమన్నారు. ఒకే సెంటర్‌లో పరీక్ష రాసిన అభ్యర్థులకు ఒకేవిధంగా మార్కులు రావడమే దీనికి సాక్ష్యమన్నారు. కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి నల్గొండ నాగయ్య, ధరావత్ రవి, పీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి పిడమర్తి భరత్, వీరబోయిన లింగయ్య, సురేష్, రవి, మధు, కిరణ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రవాణా చేస్తున్న ముఠా అరెస్ట్

- పంతంగి టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీల్లో పట్టుబడిన నిందితులు
- రెండు కార్లు, 280 కిలోల గంజాయి స్వాధీనం
- ముగ్గురిని కోర్టులో రిమాండ్ చేసిన పోలీసులు



ఇన్నోవా కారు వెనుక భాగంలో దొరికిన గంజాయి ప్యాకెట్లు

చౌటుప్పల్: తక్కువ సమయంలోనే ఎక్కువ మొత్తంలో ఆదాయం పొందాలని భావించిన ముగ్గురు స్నేహితులు గంజాయి రవాణా చేస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. చౌటుప్పల్ సీఐ అశోక్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని సోలాపూర్ జిల్లా మంగల్‌వేద తాలూకా బ్రహ్మపురి గ్రామానికి చెందిన బోస్లా అబా(29), దక్షిణ సోలాపూర్ తాలూకా బక్షిహిప్పరంగ గ్రామానికి చెందిన అవినాష్ శివాజీ రాథోడ్(19), సోలాపూర్ పాషానగర్‌లోని మోనాశ్వరిశాల గ్రామానికి చెందిన సిద్దరామేశ్వర పూజారి(27) డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. స్నేహితులైన వీరు తమకు వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. విషయాన్ని తమ స్నేహితుడైన మహారాష్ట్రలోని సోలాపూర్‌కు చెందిన అజయ్ రాథోడ్‌కు చెప్పారు. తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి తీసుకొచ్చి స్థానికంగా విక్రయిస్తే పెద్దఎత్తున డబ్బు వస్తుందని అజయ్ రాథోడ్ వీరికి చెప్పాడు. తాను ఇదే పనిచేసి బాగా సంపాదిస్తున్నానని తెలిపాడు. దీంతో ముగ్గురు కలిసి గంజాయి రవాణా చేసేందుకు అంగీకరించారు.

ఒడిశా రాష్ట్రం నుంచి గంజాయి కొనుగోలు చేసి..

ముగ్గురు యువకులు గంజాయి రవాణా చేసేందుకు ముందుకు రావడంతో అజయ్ రాథోడ్ తనకు గంజాయి ఇప్పించే ఒడిశా రాష్ట్రం మల్కాన్‌గిరి జిల్లా అలిమెలె తాలూకా ఆలూరికోట గ్రామానికి చెందిన తేజ అనే వ్యక్తిని సంప్రదించాడు. తనకు సరుకు కావాలని చెప్పాడు. దీనికి తేజ అంగీకరించాడు. ఈ క్రమంలో ఈ నెల 23న బోస్లా అబా, అవినాష్ శివాజీ రాథోడ్, సిద్దరామేశ్వర పూజారి కలిసి అజయ్ రాథోడ్ సూచనల ప్రకారం రెండు కార్లలో సోలాపూర్ నుంచి హైదరాబాద్–ఖమ్మం మీదుగా ఆలూరికోటకు వెళ్లారు. అప్పటికే సమాచారం ఇవ్వడంతో అక్కడ గంజాయి సరఫరాదారుడైన తేజ వీరికి 280కిలోల ఎండు గంజాయిని అప్పగించాడు. దానిని ప్యాకెట్లుగా మార్చుకొని రెండు కార్లలో విజయవాడ–హైదరాబాద్ మీదుగా సోలాపూర్ బయల్దేరారు.

వాహనాల తనిఖీల్లో చిక్కిన ముఠా

చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద ఎల్‌బీనగర్ ఎస్‌ఓటీ పోలీసులు, చౌటుప్పల్ సివిల్ పోలీసులు ఈ నెల 25న మధ్యాహ్నం వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో స్విఫ్ట్ డిజైర్, ఇన్నోవా కార్లు అనుమానాస్పదంగా కనిపించాయి. వెంటనే వాటిని ఆపి సోదాలు చేయగా వాటిల్లో గంజాయి ప్యాకెట్లు దర్శనమిచ్చాయి. అందులో ప్రయాణిస్తున్న బోస్లా అబా, అవినాష్ శివాజీ రాథోడ్, సిద్దరామేశ్వర పూజారిని అదుపులోకి తీసుకొని విచారించగా మొత్తం వివరాలు వెల్లడించారు. రెండు కార్లతో పాటు 280కిలోల గంజాయి ప్యాకెట్లు, మూడు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.80.30లక్షలు ఉంటుందని పోలీసులు నిర్ధారించారు. ముగ్గురు నిందితులను రిమాండ్ నిమిత్తం చౌటుప్పల్ కోర్టులో హాజరుపర్చారు. న్యాయమూర్తి ఆదేశాలతో నల్లగొండ జైలుకు తరలించారు. రాచకొండ సీపీ తరుణ్‌జోషి పర్యవేక్షణలో ఎస్‌ఓటీ డీసీపీ మురళీధర్ ఆధ్వర్యంలో ఈ ఆపరేషన్‌ను పోలీసులు విజయవంతంగా నిర్వహించారు.

మిర్యాలగూడలో 2.750 కిలోలు..



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖరరాజు

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ పట్టణంలోని అగ్రిగోల్డ్ వెంచర్‌లో గంజాయి విక్రయిస్తున్న వారిని బుధవారం వన్ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర రాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మాచర్ల మున్సిపాలిటీకి చెందిన బత్తుల వెంకటేష్ గంజాయిని ప్యాకెట్ల రూపంలో తీసుకొచ్చి మిర్యాలగూడ పట్టణంలోని వినోభానగర్‌కు చెందిన గుంజ శ్రీకాంత్, గాంధీనగర్‌కు చెందిన ఎడవెల్లి ఘని, వేముల సాయిబాబా అలియాస్ సాయి, సుందర్‌నగర్‌కు చెందిన జాదవ్ మహేష్ అలియాస్ మింటు జాని, ముత్తిరెడ్డికుంటకు చెందిన పురం సందీప్, రమావత్ సునీల్‌కు విక్రయించేవాడు. వారు మిర్యాలగూడ పట్టణంలోని అగ్రిగోల్డ్ వెంచర్‌లో స్థానిక యువకులకు గంజాయిని విక్రయిస్తుండగా.. వన్ టౌన్ సీఐకి అందిన సమాచారం మేరకు తన సిబ్బందితో అక్కడికి చేరుకుని వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 2.750 కిలోల గంజాయి, నాలుగు సెల్‌ఫోన్లు, రూ.3వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులను పట్టుకున్న సీఐ జి. సుధాకర్, ఎస్‌ఐ రవికుమార్, కానిస్టేబుళ్లు ఎన్. శ్రీను, పి. నాగరాజు, ఎం. సైదులు, తమీజుద్దీన్, వీరబాబు, వెంకటేశ్వర్లు, సీతారాములును డీఎస్పీ అభినందించారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

చివ్వెంల(సూర్యాపేట): హత్య కేసులో నిందితుడికి జీవితఖైదు విధిస్తూ సూర్యాపేట జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి శ్యామ్‌శ్రీ బుధవారం తీర్పు వెలువరించారు. వివరాలు.. సూర్యాపేట మండలం బాలెంల గ్రామానికి చెందిన ఉప్పుల విష్ణు, అతడి సోదరుడు ఉప్పుల లింగయ్య తమ పొలాలకు ఎస్సారెస్పీ కాలువ నీరు పెట్టుకునేందుకు గతేడాది జనవరి 16వ తేదీ రాత్రి 10.30 గంటల సమయంలో వెళ్లారు. కాలువ నీరు వారు పొలానికి మలుపుతుండగా అదే గ్రామానికి చెందిన ఉప్పుల సతీష్ తన పొలం నుంచి వస్తున్న ఎస్సారెస్పీ నీరు మలుపవద్దంటూ అడ్డుకట్ట వేశాడు. దీంతో లింగయ్య, సతీష్ మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో లింగయ్య అడ్డుకట్ట తొలగిస్తుండగా సతీష్ తన వెంట తీసుకొచ్చిన గొడ్డలితో లింగయ్య మెడ, ఛాతి, భుజంపై విచక్షణారహితంగా దాడి చేశాడు. దీంతో లింగయ్య ఒక్కసారిగా కేకలు వేయడంతో అక్కడే ఉన్న లింగయ్య సోదరుడు విష్ణు అన్న వద్దకు వచ్చేసరికి సతీష్ అక్కడ నుంచి పరారయ్యాడు. వెంటనే విష్ణు అక్కడే ఉన్న పక్క పొలం రైతుల సహకారంతో లింగయ్యను 108 వాహనంలో సూర్యాపేట జనరల్ హాస్పిటల్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలుపడంతో హైదరాబాద్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి సోదరుడు విష్ణు ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ సోమ్‌నారయణ్ సింగ్ ఆదేశాలతో ఎస్‌ఐ సాయిరాం నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. పలువురు సాక్షులను విచారించిన న్యాయమూర్తి పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాతి సవీందర్‌కుమార్ వాదనలతో ఏకీభవిస్తూ నిందితుడికి జీవితఖైదుతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. జరిమాన చెల్లించని పక్షంలో మరో 3 నెలలు జైలు శిక్ష అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. పీపీకి లైజన్ ఆఫీసర్ గంపల శ్రీకాంత్, కోర్టు కానిస్టేబుల్ శోభన్‌బాబు సహకరించారు.

ఇరువర్గాల ఘర్షణ.. 12 మందిపై కేసు నమోదు

హుజూర్‌నగర్ (చింతలపాలెం): చింతలపాలెం మండలం శోభనాద్రిగూడెంలో బుధవారం రెండు వర్గాలు ఘర్షణ పడగా.. 12మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. చింతలపాలెం ఎస్‌ఐ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శోభనాద్రిగూడేనికి చెందిన దేశినేని రామారావు బుధవారం పీక్ల నాయక్ తండాకు చెందిన లకావత్ సైదులుకు చెందిన మట్టిని తరలిస్తున్న టిప్పర్లను ఆపాడు. ఈ విషయమై ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే రామారావు, సైదులు తరఫువారు రెండు వర్గాలుగా ఏర్పడి శోభనాద్రిగూడెం చెరువు నుంచి మట్టి తోలుకునే విషయంలో గొడవ పడి ఒకరిపై ఒకరు రాళ్లు వేసుకున్నారు. పోలీసులు వారిని అక్కడి నుంచి పంపించేశారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు 12 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చేనేత ఉత్పత్తులను ప్రోత్సహించాలి

- చేనేత, జౌళిశాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశం



చేనేత వస్త్రాల పరిరక్షణ చట్టం కాపీని చూపిస్తున్న వెంకటేశం

భూదాన్‌పోచంపల్లి: నిజమైన చేనేత ఉత్పత్తులు, వాటి స్వచ్ఛతను ప్రోత్సహించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి, చేనేత, జౌళిశాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ఎం. వెంకటేశం అన్నారు. బుధవారం భూదాన్‌పోచంపల్లి పట్టణ కేంద్రంలోని చేనేత టై అండ్ డై అసోసియేషన్ రజతోత్సవ భవనంలో చేనేత కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హ్యాండ్లూమ్ మార్కు, సిల్క్ మార్కు, చేనేత వస్త్రాల భౌగోళిక గుర్తింపుపై చేనేత వస్త్ర వ్యాపారులు, చేనేత కార్మికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నకిలీ వస్త్రాలను విక్రయించడం వల్ల భవిష్యత్తులో భౌగోళిక గుర్తింపు కలిగిన(పేటెంట్ హక్కు) పోచంపల్లి ఇక్కత్, గద్వాల సిల్క్ చీరలు, గొల్లభామ చీరలు, తేలియా రుమాల్, వరంగల్ తివాచీలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందన్నారు. నకిలీ వస్తువులను విక్రయించడం, వాటిని ప్రోత్సహించడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. మర మగ్గాలపై ఎక్స్‌ట్రా వార్పు, వెఫ్ట్‌తో వస్త్రాలను తయారు చేయవద్దని, కానీ సింగిల్ ఇక్కత్ వస్త్రాలను తయారుచేసి విక్రయించుకోవచ్చన్నారు. ఒరిజినల్ చేనేత వస్త్రాలు తయారు చేసేవారికి ఎలప్పుడూ ప్రభుత్వ మద్దతు ఉంటుందన్నారు. చేనేత ఉత్పత్తులకు సిల్క్‌మార్కు, హ్యాండ్లూమ్ మార్కు లోగో తప్పనిసరి అని, తద్వారా తమ వస్త్రాలను డిమాండ్‌గా అమ్ముకోవచ్చన్నారు. పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలను ప్రింటింగ్ చేసి విక్రయించేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా పలువురు చేనేతకార్మికులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె. జయరావు, ఏడీఓ ఎండీ షకీల్, జిల్లా చేనేత, జౌళిశాఖ ఏడీ విద్యాసాగర్, టైఅండ్‌డై అసోసియేషన్ అధ్యక్షుడు భారత లవకుమార్, గౌరవ అధ్యక్షుడు కర్నాటి బాలరాజు, కార్యదర్శి ముస్కూరి నర్సింహ, ఉపాధ్యక్షులు ఈపూరి ముత్యాలు, మంగళపల్లి రమేశ్, వనం దశరథ, సీత భవాని, శంకరయ్య, సీత కృష్ణ, నామాల శ్రీనివాస్, రచ్చ భాస్కర్, గంజి యుగేంధర్, వేముల నరేశ్, రవీందర్ పాల్గొన్నారు.

జానపండ్లు వచ్చేశాయ్..

పెద్దవూర: ప్రకృతి సిద్ధంగా అడవులలో సీజనల్‌గా లభ్యమయ్యే జాన పండ్లు వచ్చేశాయ్. పెద్దవూర మండలంలోని కృష్ణపట్టి ప్రాంతంలో జూన్ నెలలో జానపండ్లు లభ్యమవుతుంటాయి. గిరిజనులు అడవుల్లోకి వెళ్లి జానపండ్లను ఏరుకుని రెండుమూడు రోజులవి ఒక దగ్గర కూడబెట్టి విక్రయిస్తుంటారు. పెద్దవూర మండల కేంద్రంలో గిరిజనులు జాన పండ్లను తెచ్చి వీధుల్లో తిరుగుతూ విక్రయిస్తున్నారు. పులుపు, తీపి రుచులతో ఉండే జాన పండ్లలో పోషకాలతో పాటు విటమిన్లు ఉంటాయి.



పెద్దవూరలో జాన పండ్లు కొనుగోలు చేస్తున్న ప్రజలు



జాన పండ్లు

యువత మత్తుకు దూరంగా ఉండాలి

- ఎంజీయూ రిజిస్ట్రార్ రవి



మాట్లాడుతున్న ఎంజీయూ రిజిస్ట్రార్ రవి

నల్లగొండ రూరల్: యువత మత్తుకు దూరంగా ఉండాలని మహాత్మా గాంధీ యూనివర్సిటీ(ఎంజీయూ) రిజిస్ట్రార్ అల్వాల రవి అన్నారు. బుధవారం ఎంజీయూలో నిర్వహించిన డ్రగ్స్ నిర్మూలన దినోత్సవంలో ఆయన మాట్లాడుతూ.. యుక్త వయస్సులో తెలిసీతెలియక యువత గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ముందు జాగ్రత్తగా మత్తుకు దూరంగా ఉంటే యువత తమ భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకుంటారన్నారు. మత్తు పదార్థాల వల్ల అనారోగ్యంతో పాటు కుటుంబం విచ్ఛిన్నమవుతుందన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు శ్రీనివాస్, సుధాకర్, వీరస్వామి, మద్దిలేటి, ప్రేమ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్య రహిత జిల్లాగా మారాలి



నల్లగొండ: ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్, అధికారులు తదితరులు

- నల్లగొండ కలెక్టర్ నారాయణరెడ్డి

నల్లగొండ : నల్లగొండను మాదకద్రవ్య రహిత జిల్లాగా మార్చడానికి అందరూ కదిలిరావాలని నల్లగొండ కలెక్టర్ నారాయణరెడ్డి కోరారు. మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం నల్లగొండలోని ఎన్జీ కళాశాల నుంచి క్లాక్ టవర్ వరకు నిర్వహించిన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్లాక్ టవర్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి మనిషికి 15 నుంచి 35 సంవత్సరాల లోపు వయసు ముఖ్యమైందని.. ఆ వయస్సులో మాదకద్రవ్యాలకు బానిస అయితే జీవితం నాశనమవుతుందని చెప్పారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, కుటుంబానికి అండగా నిలబడాలని సూచించారు. జిల్లాలో మత్తుమందులు ఎక్కడా కనిపించొద్దని.. దీనికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకుంటోందన్నారు. మాదకద్రవ్యాల అమ్మకం, రవాణా, వాటి మూలాలు ఎక్కడున్నా ఉక్కుపాదం మోపుతామన్నారు. కార్యక్రమంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రెటరీ దీప్తి, చోల్లేటి ప్రభాకర్, అధికారులు ప్రేమ్‌కరణ్‌రెడ్డి, నాగిరెడ్డి, రాజ్‌కుమార్, సక్కుబాయి, నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి, అమరేందర్‌రెడ్డి, కె.వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న నల్లగొండ కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

వడ్డీ వ్యాపారుల వేధింపులతో వ్యక్తి ఆత్మహత్య

- ఉరేసుకుని బలవన్మరణం



శంకర్ (ఫైల్)

నాగార్జునసాగర్: వడ్డీ వ్యాపారుల వేధింపులు భరించలేక ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని హిల్ కాలనీలో మంగళవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హిల్‌కాలనీలోని ఎరుకలవాడకు చెందిన కండెల శంకర్(34)వడ్డీలకు డబ్బులు ఇచ్చేవాడు. ఈ క్రమంలో ఊరూరా తిరిగి వడ్డీకి డబ్బులు ఇచ్చే కుంచె(డేరా) ఎరుకల వద్ద శంకర్ అప్పు తీసుకుని తనకు తెలిసిన వారికి ఇచ్చాడు. వారు డబ్బులు సరిగ్గా చెల్లించకపోవడంతో శంకర్‌కు అప్పు ఇచ్చిన కుంచె(డేరా) ఎరుకల నుంచి ఒత్తిడి పెరిగింది. ఈ క్రమంలో నాలుగు రోజుల క్రితం వడ్డీ వ్యాపారులు శంకర్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మాచర్లకు తీసుకెళ్లి డబ్బులు ఎప్పుడిస్తావని బెదిరించి కొట్టారు. శంకర్ ఇంటికి తిరిగి రాకపోవడంతో మంగళవారం అతడి కుటుంబ సభ్యులు నాగార్జునసాగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో స్థానిక ఎస్‌ఐ సంపత్ గౌడ్ అనుమానం ఉన్న వ్యక్తులను పిలిపించి మందలించాడు. అదే రోజు రాత్రి ఇంటికి వచ్చిన శంకర్ మనస్తాపానికి గురై బుధవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే నాగార్జునసాగర్‌లోని కమలా నెహ్రూ ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతడు మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆత్మహత్యకు ముందు ఎస్‌ఐకి లేఖ..

రాష్ట్రంలోని పలు జిల్లాలలో వడ్డీ వ్యాపారం చేస్తున్న కుంచె(డేరా) ఎరుకలు అధిక వడ్డీ వసూలు చేస్తున్నారని ఆత్మహత్యకు ముందు రాసిన లేఖలో శంకర్ పేర్కొన్నాడు. ఎస్పీ, సీఎం దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి వడ్డీ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని స్థానిక ఎస్‌ఐకి రాసిన లేఖలో మృతుడు కోరాడు. రూ.కోటి వడ్డీకి ఇచ్చి అదనంగా మరో రూ.కోటి వసూలు చేస్తారని, వారిదంతా అక్రమ వడ్డీ వ్యాపారం అని లేఖలో పేర్కొన్నాడు. తనను అక్రమ వడ్డీ వ్యాపారులైన వనం శంకర్, అతడి భార్య సుంకమ్మ, పోల్ల సుబ్బయ్య, వారి కుమారులు ఇద్దరు, మెదక్‌కుచ చెందిన బోళ్లదారి కవిత వారి అల్లుళ్లు రెండు రోజుల పాటు చిత్రహింసలు పెట్టారని పేర్కొన్నాడు. తెలంగాణలోని ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు తన లేఖను అర్థం చేసుకుంటారని ప్రార్థిస్తూ తన ప్రాణాలు తీసుకుంటున్నానని లేఖలో రాసుకొచ్చాడు. అక్రమ వడ్డీ వ్యాపారస్తులకు సంబంధించిన వీడియో తన మొబైల్‌లో ఉందని, తన ఆటో తిరుపతి శ్రీనివాసపురం కృష్ణంరాజు ఇంటి వద్ద ఉందని చివరిలో పేర్కొన్నాడు.

వెంచర్‌కు చెరువు మట్టి తరలింపు

- టిప్పర్లు, డోజర్లను సీజ్ చేసిన రెవెన్యూ అధికారులు



వెంచర్‌లో పోసిన చెరువు మట్టిని చదును చేస్తున్న డోజర్

మిర్యాలగూడ: మండలంలోని వెంకటాద్రిపాలెం గ్రామంలో గుడిపాటి శ్రీనివాస్ అనే వ్యక్తి చేస్తున్న వెంచర్‌కు అదే గ్రామ చెరువు నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తుండగా బుధవారం రెవెన్యూ అధికారులు టిప్పర్లు, డోజర్లు సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఐ సత్యనారాయణ మాట్లాడుతూ.. మొత్తం మూడు టిప్పర్లు, రెండు డోజర్లను సీజ్ చేసినట్లు తెలిపారు. కాగా చెరువు నుంచి ఇప్పటికే సుమారు 200 టిప్పర్ల మట్టిని వెంచర్‌కు తరలించినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. మట్టిని అక్రమంగా తరలించిన వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో మహిళ బలవన్మరణం

మిర్యాలగూడ అర్బన్: కుటుంబ కలహాలతో మహిళ బలవన్మరణానికి పాల్పడిన ఘటన మిర్యాలగూడ పట్టణంలోని బంగారుగడ్డలో బుధవారం రాత్రి జరిగింది. టూ టౌన్ సీఐ నాగార్జున తెలిపిన వివరాల ప్రకారం.. ఫాతియా నిషాబేగం (45) ఆమె భర్త సైదుద్దీన్‌కు గత కొద్ది రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపానికి గురైన ఫాతియా బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆత్మహత్యకు గల కారణాలను తెలుసుకున్నారు, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు కాగా.. వారికి వివాహమైంది. మృతురాలి అన్న జబ్బార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

హత్య కేసును ఛేదించిన పోలీసులు


- నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖరరాజు

మిర్యాలగూడ అర్బన్: నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని హిల్‌కాలనీలో రెండు రోజుల క్రితం వ్యక్తిని హత్య చేసి పూడ్చిపెట్టిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. మిర్యాలగూడ డీఎస్పీ కె. రాజశేఖరరాజు తెలిపిన వివరాల ప్రకారం.. హిల్‌కాలనీ మెయిన్ బజార్‌లో నాగేశ్వర్‌రావు అనే వ్యక్తి నూతనంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నాడు. ఈ షాపింగ్ కాంప్లెక్స్‌లో కొంత భాగాన్ని ఆక్స్‌ఫర్డ్ స్కూల్ నిర్వహణకు లీజుకు ఇచ్చాడు. ఈ స్కూల్‌లో నాగార్జునసాగర్ హిల్‌కాలనీకి చెందిన సయ్యద్ రహమాన్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 22వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఇన్నిస్‌పేట గ్రామానికి చెందిన సిరావు నాగబాల సాయిరెడ్డి షాపింగ్ కాంప్లెక్స్ ఓనర్ వద్దకు వచ్చి తాను పెయింటింగ్ పనిచేస్తానని చెప్పడంతో అతడికి పని ఇచ్చాడు. ఆ సమయంలో రహమాన్‌కు, నాగబాల సాయిరెడ్డికి పని విషయంలో గొడవ జరిగింది. ఆ తర్వాత రోజు రాత్రి 10గంటల సమయంలోనూ నాగబాల సాయిరెడ్డి పెయింటింగ్ పని చేస్తుండగా... రహమాన్ ఓనర్‌కు ఫోన్ చేసి విషయం చెప్పాడు. అతడి పని అతను చేసుకుంటాడని ఓనర్ రహమాన్‌తో చెప్పి ఫోన్ పెట్టేశాడు. అదే రోజు రాత్రి 12గంటల సమయంలో రహమాన్, నాగబాల సాయిరెడ్డి గొడవ పడ్డారు. ఈ క్రమంలో నాగబాల సాయిరెడ్డి డ్రిల్లింగ్ మిషన్ రాడ్డుతో రహమాన్ తలపై కొట్టడంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని మొదటి అంతస్తు నుంచి కిందకు తీసుకొచ్చిన నాగబాల సాయిరెడ్డి స్కూల్ ఆవరణలో గుంతను తవ్వి అందులో పూడ్చిపెట్టి అక్కడి నుంచి పరారయ్యాడు. మరుసటిరోజు ఉదయం అక్కడికి వచ్చిన ఓనర్‌కు ఇద్దరు వ్యక్తులు కనిపించకపోవడం, పై అంతస్తులో రక్తం మరకలు ఉండటంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. డాగ్ స్క్వాడ్ చూపిన ఆనవాళ్ల మేరకు షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలోనే రహమాన్ మృతదేహాన్ని వెలికితీశారు. నాగబాల సాయిరెడ్డే రహమాన్‌ను హత్య చేసినట్లు భావించిన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. కాగా బుధవారం నిందితుడు పెద్దవూర వై జంక్షన్ వద్ద ఉన్నట్లు గుర్తించిన పోలీసులు అక్కడికి చేరుకుని అదుపులోకి తీసుకుని విచారించగా నిజం ఒప్పుకున్నాడు. దీంతో నిందుతుడిని రిమాండ్‌కు తరలించారు. కేసును ఛేదించిన సాగర్ సీఐ బీసన్న, విజయపురి టౌన్ ఎస్‌ఐ సంపత్, హాలియా సీఐ జనార్దన్, పెద్దవూర, తిరుమలగిరి ఎస్‌ఐలు వీరబాబు, నారాయణరెడ్డి, సిబ్బంది గురునాథం, హరిలాల్, శ్రీకాంత్‌ను డీఎస్పీ అభినందించారు.

ఎంజీయూ అధ్యాపకురాలికి డాక్టరేట్



జయంతి

నల్లగొండ రూరల్: మహాత్మగాంధీ యూనివర్సిటీ (ఎంజీయూ)లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేటిక్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఎం. జయంతి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి బుధవారం డాక్టరేట్ అందుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగంలో 2017లో పీహెచ్‌డీలో జయంతి చేరారు. ×ఎఫిసెంట్ క్లస్టర్ షెడ్యూలింగ్ యూజింగ్‌కుబెర్నెట్స్ విత్ అపచ్ స్పార్క్ ఎన్విరాన్‌మెంట్ ఆన్ గూగుల్ క్లౌడ్× అనే అంశంపై ప్రొఫెసర్ రాం మోహన్‌రావు ఆధ్వర్యంలో పరిశోధన చేసినందుకు గాను ఆమెకు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా జయంతికి ఎంజీయూ అధ్యాపకులు అభినందనలు తెలిపారు.